## నేడు కొమురవెల్లి మల్లన్న లష్కర్ వారం



చేర్యాల, జనవరి 27: సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మల్లికార్జున స్వామి క్షేత్రంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. క్షేత్రంలో గత ఆదివారం పట్నం వారం నేత్రపర్వంగా జరిగింది. ఈ ఆదివారం(నేడు) లష్కర్ వారానికి సికింద్రాబాద్ భక్తులతో పాటు కరీంనగర్, మెదక్, వరంగల్ ఉమ్మడి జిల్లాలకు చెందిన వేలాది మంది భక్తులు తరలిరానున్నారు. ఈ ఉత్సవాల్లో సికింద్రాబాద్ భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మల్లన్నను దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటారు. దీంతో బ్రహ్మోత్సవాల్లో రెండో ఆదివారాన్ని లష్కర్ వారంగా అనాదిగా పిలుస్తున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేయాలని భక్తులు కోరుతున్నారు.

## గుట్టలో 'శ్రీలహరి' గ్రంథం పంపిణీ



బ్రేక్ దర్శనం భక్తులకు శ్రీలహరి గ్రంథాన్ని అందిస్తున్న ఆలయ సిబ్బంది

యాదగిరిగుట్ట, జనవరి27: పరమ పవిత్ర శ్రీవైష్ణవ స్తోత్రాలతో తేజరిల్లుతున్న శ్రీమంతమైన మంత్ర పేటిక 'శ్రీలహరి' గ్రంథాన్ని యాదగిరి గుట్టలో స్వామివారిని దర్శించుకునే భక్తులకు ఆలయ అధికారులు అందిస్తున్నారు. శనివారం బ్రేక్ దర్శనంలో స్వామివారి దర్శించుకునేందుకు వచ్చిన 400 మంది భక్తులకు ఈ గ్రంథాన్ని అందించినట్టు ఆలయ అధికారి అశ్విని తెలిపారు. టికెట్ కొనుగోలు చేసే సెంటర్‌లో బ్రేక్ దర్శనం, అభిషేక టికెట్ తోపాటు ఈ గ్రంథాన్ని అందిస్తున్నారు. ప్రముఖ రచయిత, శ్రీశైల దేవస్థానం పూర్వ ప్రత్యేక సలహాదారు పురాణపండ శ్రీనివాస్ రచించి, సంకలనం చేసిన 'శ్రీ లహరి' గ్రంథాన్ని భోగి పండుగ రోజున ఆలయంలో ఆవిష్కరించారు. రెండు వారాలుగా బ్రేక్ దర్శనం, అభిషేకంలో పాల్గొనే భక్తులకు ఈ గ్రంథాన్ని అందిస్తున్నట్టు అధికారులు పేర్కొన్నారు.


## శివలింగంపై నాగుపాము నాట్యం

*కరీంనగర్ జిల్లా హుజురాబాద్ పట్టణంలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో శనివారం ఉదయం 9:30 గంటల ప్రాంతంలో ఓ నాగుపాము శివలింగంపైకి చేరుకొని పడగ విప్పి నాట్యం చేసింది. అప్పటివరకు గుడిలో ఉన్న భక్తులు శివలింగాన్ని చుట్టుకుని ఉన్న నాగుపామును చూసి భయాందోళనకు గురయ్యారు. తర్వాత తేరుకుని పాముకు మొక్కుకుని, పూజలు చేశారు. నాగుపాము శివలింగంపైకి చేరుకుని పడగ విప్పడంపై శివ మహిమ అంటూ భక్తులు చర్చించుకున్నారు.*

*-హుజూరాబాద్ టౌన్*



### లోకం పోకడ




# గడ్డికోసినా కరెంటు షాకే!

- కమర్షియల్ విద్యుత్తు కనెక్షన్ తీసుకోవాల్సిందే: విద్యుత్తు అధికారులు
- గడ్డికోత యంత్రం వినియోగిస్తున్న రైతులపై అధికారుల ఒత్తిడి
- లేదంటే జరిమానా తప్పదని హెచ్చరిక
- లబోదిబోమంటున్న రైతన్నలు
- మహేశ్వరం సర్వసభ్య సమావేశంలో స్థానిక ప్రజాప్రతినిధుల ఆగ్రహం



హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, జనవరి 27 (నమస్తే తెలంగాణ): దాదాపు ప్రతిరైతు మూగజీవాలను పెంచుకుంటూ ఉంటాడు. జిల్లాల పరిధిలోని గ్రామాల్లో వాటికి మేత పుష్కలంగా దొరుకుతుంది కాబట్టి ఇబ్బందేమీ ఉండదు. మరి, హైదరాబాద్ చుట్టపక్కల ఉన్న రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి జిల్లాల సంగతేమిటి? ఆయా జిల్లాల్లో ఉండే లక్షలాదిమంది సన్న, చిన్నకారు రైతులు కూరగాయలు పండిస్తూ ఆర్థిక చేదోడు కోసం బర్రెలను కూడా పెంచుకుంటూ ఉంటారు. వాటికి మేత దొరికే పరిస్థితి లేకపోవడంతో తమకున్న పొలంలోనే ఒకటిరెండు మడుల్లో పచ్చిగడ్డి కూడా పండిస్తారు. పశువులు ఆకులు తిని బలవర్ధకమైన కాండంలోని గుజ్జును వదిలేస్తున్నాయి. ఇలా అయితే గడ్డి వృథా కావడంతోపాటు పశువులకు సరైన మేత అందడం లేదని భావించిన రైతులు గడ్డిని కోసే చిన్న యంత్రాలు (కుట్టి మిషన్) తెచ్చుకుని గడ్డిని చిన్నచిన్న ముక్కలుగా చేసి పశువులకు పెడుతున్నారు.

### పగబట్టిన విద్యుత్తు అధికారులు

గడ్డికోత యంత్రాలు ఉన్న రైతులపై విద్యుత్తు అధికారులు పగబట్టారు. ఈ యంత్రాలున్న ప్రతి రైతు కమర్షియల్ కరెంటు కనెక్షన్ తీసుకోవాల్సిందేనంటూ ఆదేశాలు జారీచేశారు. ఇందుకోసం వెంటనే డీడీలు తీయాలని, లేదంటే జరిమానా తప్పదని హెచ్చరిస్తున్నారు. శనివారం మహేశ్వరం మండల సర్వసభ్య సమావేశంలో పలువురు ప్రజాప్రతినిధులు ఇదే విషయాన్ని ప్రస్తావిస్తే తమకు పైనుంచి ఆదేశాలు ఉన్నాయని అధికారులు పేర్కొన్నారు. యంత్రాలు ఉన్న రైతులు కమర్షియల్ కరెంటు కనెక్షన్ తీసుకోక తప్పదని తెగేసి చెప్పడంతో రైతులు లబోదిబోమంటున్నారు.

# రాష్ట్రంలో కులగణన

> మొదటిపేజీ తరువాయి...

ఆదేశించారు. ఇప్పుడున్న దాని కంటే ఎక్కువ మంది అర్హులైన విద్యార్థులకు మేలు చేకూరేలా చూడాలని సూచించారు. ర్యాంకింగ్‌ల ఆధారంగా విదేశాల్లోని టాప్ యూనివర్సిటీలను గుర్తించి ఒక ఫ్రేమ్‌వర్క్ రూపొందించాలని, వాటిలో చదివేందుకు వెళ్లే విద్యార్థులకు ఈ స్కీమ్‌లో మొదటి ప్రాధాన్యమివ్వాలని సూచించారు.

### తులం బంగారానికి బడ్జెట్

కల్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ లబ్ధిదారులకు నగదుతో పాటు తులం బంగారం అందించేందుకు అంచనా బడ్జెట్‌ను రూపొందించాలని సంబంధిత అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. రాష్ట్రంలో ఇప్పుడున్న బీసీ స్టడీ సర్కిళ్లను ప్రతి పార్లమెంట్ నియోజకవర్గం యూనిట్‌గా ఏర్పాటు చేసే అంశంపై అధ్యయనం చేయాలని సూచించారు. బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, గిరిజన సంక్షేమశాఖ మంత్రి సీతక్క, బీసీ, ఎస్సీ, మైనార్టీశాఖల ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ప్రభుత్వ ప్రదాన కార్యదర్శి శాంతికుమారి, బీసీ సంక్షేమశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం, బీసీ, ఎస్సీ గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శులు మల్లయ్యభట్టు, నవీన్‌నికోలస్, సంబంధిత శాఖల అధికారులు ఈ సమీక్షలో పాల్గొన్నారు.

## ఒక్కో నియోజకవర్గంలో ఎడ్యుకేషన్ హబ్

ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ గురుకుల విద్యా సంస్థలన్నీ వేర్వేరు చోట్ల విడివిడిగా కాకుండా వాటికోసం ఇంటిగ్రేటెడ్ ఎడ్యుకేషన్ హబ్ ఏర్పాటు చేయాలని రేవంత్‌రెడ్డి ఆదేశించారు. నియోజకవర్గానికి ఒక ఇంటిగ్రేటెడ్ హబ్ నిర్మించే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, తద్వారా స్కూళ్ల నిర్వహణ, పర్యవేక్షణ, అజమాయిషీ మరింత మెరుగ్గా చేసే వీలుంటుందని వివరించారు. ఎక్కువమంది విద్యార్థులు ఒకే ప్రాంగణంలో చదువుకోవడం ద్వారా వారిలో ప్రతిభా పాటవాలు పెరుగుతాయని, పోటీతత్వం పెరుగుతుందని సీఎం అభిప్రాయపడ్డారు. వెంటనే అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో ఎడ్యుకేషన్ హబ్‌ల నిర్మాణానికి సరిపడా స్థలాలను గుర్తించాలని ఆదేశించారు. నియోజకవర్గ కేంద్రంలో వీలు కాకుంటే ప్రత్యామ్నాయంగా అదే సెగ్మెంట్లో మరో పట్టణం లేదా మండల కేంద్రాలను ఎంచుకోవాలని, ఇప్పటికే 20 ఎకరాలకుపైగా విస్తీర్ణమున్న స్కూల్ ప్రాంగణాల్లో మిగతా భవనాలు నిర్మించి హబ్‌గా తీర్చిదిద్దే అవకాశాలుంటే పరిశీలించాలని దిశానిర్దేశం చేశారు. ఎడ్యుకేషన్ హబ్‌ల నిర్మాణానికి కార్పొరేట్ సంస్థలు, కంపెనీల సహకారం తీసుకోవాలని, సీఎస్ఆర్ (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ) ఫండ్స్‌ను సమీకరించాలని, దాతల నుంచి విరాళాలు స్వీకరించి ఈ భవన నిర్మాణాలు చేపట్టాలని, ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో అవసరమైన మౌలిక సదుపాయాలు, విద్యార్థులకు ఇచ్చే దుప్పట్లు, నోట్ బుక్స్, యూనిఫామ్స్, పుస్తకాలకు కూడా సీఎస్ఆర్ ద్వారా నిధులు సమీకరించాలని సూచించారు.

## ఫిబ్రవరిలో పెరగనున్న ఉష్ణోగ్రతలు

హైదరాబాద్, జనవరి 27 (నమస్తే తెలంగాణ): వచ్చే నెల రెండోవారం నాటికి ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం డైరెక్టర్ నాగరత్న ఒక ప్రకటనలో తెలిపారు. శీతాకాలం ముగింపు దశకు రావడంతో చలి తీవ్రత క్రమంగా తగ్గుతుందని పేర్కొన్నారు. ఫిబ్రవరి మొదటి వారం వరకు చలి గాలులు వీస్తాయని, రెండో వారంలో ఉదయం వేడిగాలులు, సాయంత్రం చలిగాలులు వీస్తాయని తెలిపారు. అదేనెల మూడోవారంలో మళ్లీ చలి పెరుగుతుందని, నాలుగో వారంలో ఎండల తీవ్రత మొదలవుతుందని తెలిపారు. ఫిబ్రవరి నెలలో ఎలాంటి వర్షపాతం నమోదయ్యే అవకాశాలు కనిపించడం లేదని పేర్కొన్నారు. ఎల్‌నినో ప్రభావం ఏప్రిల్ వరకు కొనసాగుతుందని, ఉష్ణోగ్రతలు పెరిగిన తర్వాత ఏమైనా మార్పులు చోటుచేసుకుంటే మార్చిలో వర్షాలు కురిసే అవకాశాలున్నట్టు డైరెక్టర్ నాగరత్న తెలిపారు.

### చలి వణుకు

| | కనిష్ఠం | గరిష్ఠం |
|---|---|---|
| ఆదిలాబాద్ | 10.7°c | 29.0°c |
| రంగారెడ్డి | 14.5°c | 34.8°c |
| కరీంనగర్ | 16.0°c | 30.0°c |
| మెదక్ | 16.1°c | 32.4°c |
| వరంగల్ | 16.5°c | 30.0°c |
| నిజామాబాద్ | 17.6°c | 30.3°c |
| ఖమ్మం | 18.0°c | 31.0°c |
| నల్లగొండ | 19.0°c | 33.0°c |
| హైదరాబాద్ | 20.2°c | 28.9°c |
| మహబూబ్‌నగర్ | 20.6°c | 32.7°c |

## కులసంఘాలన్నీ బీసీ జేఏసీలో చేరాలి

### ఆలిండియా ఓబీసీ జేఏసీ చైర్మన్ సాయిని నరేందర్

హైదరాబాద్, జనవరి27 (నమస్తే తెలంగాణ): చట్టసభల్లో బీసీ రిజర్వేషన్ల సాధన కోసం దేశవ్యాప్త ఉద్యమాన్ని చేపట్టేందుకు కులసంఘాలన్నీ బీసీ జేఏసీలో చేరాలని ఓబీసీ జేఏసీ చైర్మన్, బీసీ స్టడీ ఫోరం వ్యవస్థాపక చైర్మన్ సాయిని నరేందర్ ఒక ప్రకటనలో కోరారు. తొలుత తెలంగాణ రాష్ట్రంలో మహా పాదయాత్ర నిర్వహించాలని యోచిస్తున్నట్టు పేర్కొన్నారు. జేఏసీలో చేరాలనుకునే సంఘాలు, మద్దతిచ్చే ఇతర సామాజిక సంఘాలు 97019 16091 ఫోన్‌నంబర్‌కు వివరాలను వాట్సాప్ చేయాలని కోరారు.

## రాష్ట్ర సమగ్రాభివృద్ధికి విజన్ డాక్యుమెంట్

- త్వరలో మెగా మాస్టర్‌ప్లాన్-2050
- 31వ బిల్డర్స్ సదస్సులో సీఎం రేవంత్

హైదరాబాద్, జనవరి 27(నమస్తే తెలంగాణ): తెలంగాణ సమగ్రాభివృద్ధి కోసం త్వరలో ఓ విజన్ డాక్యుమెంట్‌ను తేనున్నట్టు సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ఇందులోభాగంగా తెలంగాణ మెగా మాస్టర్‌ప్లాన్-2050ని తేవాలని నిర్ణయించామని, దీనికి సంబంధించి త్వరలోనే టెండర్లు ఆహ్వానిస్తామని వెల్లడించారు. రాష్ట్రాభివృద్ధిలో, మెగా మాస్టర్‌ప్లాన్ రూపకల్పనలో బిల్డర్లు కూడా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. హైటెక్స్‌లో శనివారం జరిగిన 31వ ఆల్ ఇండియా బిల్డర్స్ కన్వెన్షన్‌లో రేవంత్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సీఎం మాట్లాడుతూ.. దేశ నిర్మాణంలో బిల్డర్స్ పాత్ర ఎంతో ఉందని అన్నారు. 'గొర్రె బలిస్తే గొల్లాయనకే లాభం.. అలాగే కాంట్రాక్టర్లు ఆర్థికంగా బలపడితేనే రాష్ట్రం బలపడుతుందని ప్రభుత్వం నమ్ముతున్నది. బిల్డర్లకు సమస్యలు రాకుండా చూస్తాం' అని చెప్పారు. ఔటర్ లోపల అర్బన్ తెలంగాణ, ఔటర్ నుంచి బయట సబర్బన్ తెలంగాణ, రీజనల్ రింగురోడ్డు వెలుపల నుంచి రాష్ట్ర సరిహద్దు వరకు రూరల్ తెలంగాణ మెగా మాస్టర్‌ప్లాన్-2050ని తేనున్నట్టు తెలిపారు. దీని తయారీకి సంబంధించి త్వరలోనే ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్‌ను పిలుస్తామని, బిల్డర్లు పాల్గొనాలని కోరా రు. మంత్రులు పొంగులేటి, ఉత్తమ్, కోమటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మేం కాంట్రాక్టర్లం

- *నేనూ, కోమటిరెడ్డి గుత్తేదార్లమే*
- *బిల్డర్స్ సదస్సులో పొంగులేటి వ్యాఖ్య*
- *నేను కాంట్రాక్టర్ కాదు.. తెలంగాణ ఫైటర్ : కోమటిరెడ్డి సమాధానం*

*హైదరాబాద్, జనవరి 27 (నమస్తే తెలంగాణ): ఆలిండియా బిల్డర్ కన్వెన్షన్‌లో మంత్రులు పొంగులేటి, కొమటిరెడ్డి చేసిన వ్యాఖ్యలు నెట్టింట వైరల్‌గా మారాయి. సీఎం సమక్షంలో మొదట పొంగులేటి మాట్లాడుతూ.. మీ అందరితోపాటు నేనూ, నా కొలీగ్ కోమటిరెడ్డి కూడా కాంట్రాక్టరే' అని తెలిపారు. అనంతరం కోమటిరెడ్డి ప్రసంగించారు. మళ్లీ పోడియం ముందుకొచ్చి, సీఎం రేవంత్ అనుమతి తీసుకొని మరీ.. పొంగులేటి వ్యాఖ్యలకు క్లారిటీ ఇచ్చారు. 'మా సోదరుడు, కొలిగ్ మంత్రి పొంగులేటి చెప్పినట్టు నేను కాంట్రాక్టర్‌ని కాదు. తెలంగాణ ఫైటర్‌ని. ఎన్ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్ సోల్జర్‌ని. నాకు ఏం వర్కూ లేదు. 35 ఏండ్ల నుంచి నల్లగొండలో అద్దె ఇంట్లో ఉంటున్నాను. హైదరాబాద్‌లో చిన్న ఇల్లుంది. నాకు ఎలాంటి కాంట్రాక్టులు లేవు. నేను ఎలాంటి బిజినెస్ చేయడం లేదు' అని స్పష్టం చేశారు. తర్వాత ఒకరికొకరు వేదికపై క్లారిటీ ఇచ్చుకొని, ఎడముఖం, పెడ ముఖం పెట్టి కార్యక్రమం పూర్తయ్యే వరకూ అలాగే ఉండిపోయారు. వీరిద్దరి వ్యాఖ్యలను కొందరు సామాజిక మాధ్యమాల్లో పెట్టడంతో వైరల్‌గా మారాయి.*

# 'కాళేశ్వరం'పై నిపుణుల కమిటీ

- మూడు బ్యారేజీలపై అధ్యయనం
- నివేదిక ఆధారంగానే తదుపరి చర్యలు
- కృష్ణాజలాలు, ప్రాజెక్టులపై త్వరలో అఖిలపక్షం
- ఇరిగేషన్‌పై సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి
- కేఆర్ఎంబీకి ప్రాజెక్టులను అప్పగించలేదన్న అధికారులు



సమీక్షలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

హైదరాబాద్, జనవరి 27 (నమస్తే తెలంగాణ): కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నాణ్యతను అధ్యయనం చేసేందుకు నిపుణుల కమిటీని ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. బ్యారేజీల పటిష్ఠత, కుంగిపోయిన పిల్లర్ల విషయంలో ఎలాంటి చర్యలు తీసుకోవాలో లోతుగా, సమగ్రంగా అధ్యయనం చేయించాలని సూచించారు. ఆ కమిటీ నివేదిక ఆధారంగానే ముందుకు వెళ్లాలని, అనవసరపు హడావుడి చేసి మరోసారి తప్పులకు తావివ్వద్దని ఇరిగేషన్ విభాగానికి దిశానిర్దేశం చేశారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో శనివారం నీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కాళేశ్వరం ప్రాజెక్టుపై సుదీర్ఘంగా చర్చించారు. కేంద్ర జల సంఘం, నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ నిపుణులతోపాటు, రాష్ట్రంలోని ఇరిగేషన్ ఇంజినీర్లతో నిపుణుల కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ భారీ ప్రాజెక్టు రిపేర్లకు ఎనిమిది నుంచి పది వేల కోట్లు అవసరమయితే ఖర్చుకు ఆలోచించకూడదని, రాష్ట్ర ప్రజల ప్రయోజనాల కోసం ఎక్కడా రాజీ పడాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు.

### త్వరలో అఖిలపక్ష సమావేశం..

కృష్ణాజలాల్లో మన వాటా, ప్రాజెక్టులకు సంబంధించిన అంశాలపై త్వరలోనే అఖిలపక్ష సమావేశం ఏర్పాటుచేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ప్రతిపక్షాలు చేస్తున్న వాదనల్లో నిజమెంత.. అప్పుడు నిర్ణయాలు తీసుకున్నదెవరు? వాటన్నింటినీ ప్రజల ముందు ఉంచాలని అన్నారు. నాగార్జునసాగర్, శ్రీశైలం ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగించినట్టు వస్తున్న ఆరోపణలపై అధికారులు స్పందిస్తూ.. ఇప్పటివరకు ఏ ప్రాజెక్టును అప్పగించలేదని, ఎలాంటి ఒప్పందాలపై సంతకాలు చేయలేదని వివరణ ఇచ్చారు.

### గ్రామాలవారీగా ఆయకట్టు

గ్రామాలు, మండలాల వారీగా ప్రాజెక్టుల ఆయకట్టు వివరాలు సిద్ధం చేయాలని సీఎం ఆదేశించారు. ప్రాధాన్యతలవారీగా పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. నారాయణపేట-కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని, మొదటి ప్రాధాన్యతగా తీసుకొని వీలైనంత త్వరగా ఎస్ఎల్బీసీ టన్నెల్ పనులు పూర్తి చేయాలని, తద్వారా 4 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుతుందని అధికారులను ఆదేశించారు. తక్కువ ఖర్చుతో పూర్తయ్యే ప్రాజెక్టుల జాబితాను తయారు చేయాలని చెప్పారు. సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, సాగునీటిపారుదలశాఖ కార్యదర్శి రాహుల్‌బొజ్జా, ఈఎన్సీ మురళీధర్, హరిరామ్, అనిల్‌కుమార్, నాగేందర్‌రావు, ఎస్ఈ శ్రీనివాస్ సంబంధిత శాఖ అధికారులు, పలువురు సీఈలు పాల్గొన్నారు.

## న్యూఢిల్లీ తెలంగాణ ఎక్స్‌ప్రెస్ వేళల మార్పు

హైదరాబాద్ సిటీబ్యూరో, జనవరి 27 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్-న్యూఢిల్లీ తెలంగాణ ఎక్స్‌ప్రెస్ రైలు వేళల్లో మార్పులు చేస్తూ శనివారం రైల్వే అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఈ నెల 28న ఉదయం 6 గంటలకు హైదరాబాద్ రైల్వే స్టేషన్ నుంచి బయలుదేరాల్సి ఉండగా, మధ్యాహ్నం రెండు గంటలకు బయలుదేరుతుందని రైల్వే అధికారులు తెలిపారు. ఈ మేరకు ఈ రైలును రీషెడ్యూల్ చేశామని, ఈ విషయాన్ని ప్రయాణికులు గమనించాలని పేర్కొన్నారు.

## సిరిసిల్ల చేనేతలకు యూనిఫామ్ కాంట్రాక్టు!

హైదరాబాద్, జనవరి 27(నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని పాఠశాలలు, ప్రభుత్వ దవాఖానలు, పోలీస్ శాఖకు చెందిన యూనిఫామ్ కాంట్రాక్టును సిరిసిల్ల చేనేత కార్మికులకు ఇచ్చే విషయం పరిశీలిస్తామని చేనేత సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. శనివారం సచివాలయంలో మంత్రితో విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, సిరిసిల్ల కాంగ్రెస్ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి భేటీ అయ్యారు. చేనేత కార్మికులకు ఉపాధి, బతుకమ్మ చీరల పంపిణీ సమస్యలను వారు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా కార్మికుల ఉపాధి విషయమై తుమ్మల మంత్రి పొన్నం ప్రభాకర్‌తో మాట్లాడారు. యూనిఫామ్ కాంట్రాక్టు ఇచ్చినట్లైతే సిరిసిల్ల చేనేతలకు ఏడాది పొడవునా పనిదొరికి సమస్యలు తీరుతాయని చెప్పారు.

## కుటుంబ తగాదాల్లో ఇద్దరి దారుణహత్య

మైలార్‌దేవ్‌పల్లి, జనవరి 27: కుటుంబ కలహాల కారణంగా తండ్రి, మామపై విచక్షణారహితంగా దాడి చేసి ఇనుప రాడ్డుతో అతి కిరాతకంగా కొట్టి చంపాడో దుండగుడు. హైదరాబాద్ మైలార్‌దేవ్‌పల్లి పీఎస్ పరిధిలో శనివారం ఈ ఘటన చోటుచేసుకున్నది. రాజేంద్రనగర్ సర్కిల్ బాబుల్‌రెడ్డినగర్‌లో లక్ష్మీనారాయణ (55)కుటుంబంతో జీవిస్తున్నాడు. అతడి కుమారుడు రాకేశ్ (24) డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇటీవల లక్ష్మీనారాయణ తన ఇంటిని అమ్మకానికి పెట్టగా, ఒక పార్టీ వచ్చి టోకెన్ డబ్బు చెల్లించింది. అప్పటి నుంచి ఇంట్లో తండ్రీకొడుకుల నడుమ తరచూ గొడవలు జరుగుతున్నాయి. శనివారం సాయంత్రం మరోసారి గొడవ జరిగింది. ఈ సమయంలో ఆగ్రహంతో తండ్రి లక్ష్మీనారాయణపై రాకేశ్ విచక్షణారహితంగా దాడి చేశాడు. వారించబోయిన మామ శ్రీనివాస్ (60)పైనా దాడికి పాల్పడ్డాడు. పోలీసులు లక్ష్మీనారాయణ, శ్రీనివాస్‌ను ఉస్మానియాకు తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందా రు.

## 45 రోజుల్లో వర్కింగ్ ప్రోగ్రామ్

హైదరాబాద్ సిటీబ్యూరో, జనవరి 27 (నమస్తే తెలంగాణ): వినూత్న ఆలోచనలతో స్టార్టప్‌లను ఏర్పాటు చేయాలనుకుంటున్నారా? మీ ఆలోచనలకు అనుగుణంగా ప్రొటోటైప్ అభివృద్ధి చేసే ఆలోచన ఉన్నదా? మీ కోసమే టీ హబ్ ఆధ్వర్యంలో బ్లిడ్జ్ పేరుతో కొత్తగా స్టార్టప్ ప్రోత్సాహక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. 45 రోజుల్లో పనిచేసేందుకు అనుకూలమైన నమూనా రూపొందించే సామర్థ్యం, నైపుణ్యం ఉన్నవారు దీనిలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. (https://bit.ly/42e6m3m) లింకులో సంప్రదించాలని, విద్యార్థులతో పాటు ఔత్సాహిక వ్యాపారవేత్తలు, నిపుణులు తమ ఆవిష్కరణలను ప్రొటోటైప్‌లుగా మార్చడానికి అవకాశం కల్పిస్తున్నామని తెలిపారు.

## బీసీ రిజర్వేషన్లను 50 శాతానికి పెంచాలి

- జాతీయ బీసీ కమిషన్‌కు కుమారస్వామి వినతి

హైదరాబాద్, జనవరి27 (నమస్తే తెలంగాణ): దేశంలో జనాభా దామాషా ప్రకారం బీసీ రిజర్వేషన్లను 27 నుంచి 50 శాతానికి పెంచేందుకు చొరవ చూపాలని జాతీయ బీసీ కమిషన్ చైర్మన్ హన్స్‌రాజ్ గంగారామ్‌ను జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుంద్ర కుమారస్వామి కోరారు. హైదరాబాద్ పర్యటనకు వచ్చిన చైర్మన్‌ను హరిత ప్లాజాలో శనివారం ప్రత్యేకంగా కలిసిన కుమారస్వామి వినతి పత్రం అందజేశారు. జనగణనతో పాటు ఓబీసీ కులగణన చేపట్టేలా కేంద్రానికి సిఫారసు చేయాలని విజ్ఞప్తి చేశారు. కులగణనతోనే సామాజిక న్యాయం, అసమానతలు లేని సమాజం సాధ్యమని పేర్కొన్నారు. బలహీనవర్గాల సమస్యలు, బీసీల కోసం చేపట్టాల్సిన సంక్షేమ పథకాలు, ఓబీసీ రిజర్వేషన్లు తదితర అంశాలపై ఆయనతో చర్చించారు.

# బీఆర్ఎస్‌పైనే విశ్వాసం

- కుట్రలను దీటుగా అడ్డుకున్న ప్రతిపక్షం
- కేసీఆర్ పాలనకే ప్రజాప్రతినిధుల మద్దతు
- సూర్యాపేటలో వీగిన అవిశ్వాసం
- ఆలేరులో నెగ్గిన బీఆర్ఎస్ చైర్మన్
- జమ్మికుంటలో కాంగ్రెస్‌కు ఆశాభంగం



నాగర్ కర్నూల్ జిల్లా పెంట్లవెల్లిలో పటాకులు కాల్చి సంబురాలు చేసుకుంటున్న బీఆర్ఎస్ శ్రేణులు

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, జనవరి 27: ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ అధికార పార్టీ చేస్తున్న కుట్రలను ప్రతిపక్ష బీఆర్ఎస్ సమర్థంగా అడ్డుకుంటున్నది. మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ పెడుతున్న అవిశ్వాస తీర్మానాలు వీగిపోతున్నాయి. బీఆర్ఎస్ పాలనపైనే ప్రజాప్రతినిధులు విశ్వాసం చూపుతున్నారు. ఇటీవల కరీంనగర్ జిల్లా జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ తక్కెళ్లపల్లి రాజేశ్వర్‌రావుపై పెట్టిన అవిశ్వాస తీర్మానం వీగిపోగా, తాజాగా సూర్యాపేటతో పాటు ఆలేరు మున్సిపాలిటీల్లోనూ కాంగ్రెస్‌కు ఆశాభంగమే అయ్యింది.

### పేటలో పారని కాంగ్రెస్ పాచికలు

సూర్యాపేట మున్సిపాలిటీని తన ఖాతాలో వేసుకోవాలన్న కాంగ్రెస్ పాచికలు పారలేదు. బీఆర్ఎస్‌కు చెందిన మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, వైస్ చైర్మన్ పుట్ట కిశోర్‌పై విపక్షాలు ప్రవేశపెట్టిన అవిశ్వాసం వీగిపోయింది. కాంగ్రెస్ ఎత్తులను సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి చిత్తు చేశారు. మొత్తం 48 మంది కౌన్సిలర్లు ఉండగా కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీ కలిసి ఆవిశ్వాసానికి కావాల్సిన 32 మందితో నోటీసు ఇచ్చారు. సదరు కౌన్సిలర్లను నల్లగొండ జిల్లాకు చెందిన ఓ ఎమ్మెల్యే పర్యవేక్షణలో హైదరాబాద్, గోవాతో పాటు మరికొన్ని ప్రాంతాల్లో 17 రోజులపాటు క్యాంపుల్లో ఉంచారు. ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డితో కలిపి బీఆర్ఎస్‌కు 16 మంది ఉన్నారు. విపక్ష క్యాంపులో ఉన్న ముగ్గురు బీజేపీ కౌన్సిలర్లు రెండ్రోజుల ముందు అవిశ్వాసానికి దూరంగా ఉంటామని ప్రకటించి, కనిపించకుండా పోయారు. వారికి హైదరాబాద్‌లో సీఎం చాంబర్ కేంద్రంగా ఫ్లైట్ టికెట్లు బుక్ చేసినట్టు సమాచారం. శనివారం మున్సిపల్‌లో నిర్వహించిన ప్రత్యేక సమావేశానికి ఒక్కరూ హాజరుకాలేదు. కాంగ్రెస్ శిబిరానికి చెందిన ఓ కౌన్సిలర్ బీఆర్ఎస్ వైపు వచ్చినట్టు తెలిసింది. దీంతో మిగిలిన 31 మంది హాజరైనా ఫలితం ఉండదని భావించి రాలేదు. దీంతో అవిశ్వాస తీర్మానం వీగిపోయినట్టు అధికారులు ప్రకటించారు. యాదాద్రి జిల్లా ఆలేరు మున్సిపల్ చైర్మన్ వస్పరి శంకరయ్యపై 8 మంది కౌన్సిలర్లు అవిశ్వాసం పెట్టగా శనివారం ఆర్డీవో అమరేందర్ సమావేశం నిర్వహించారు. 12 మందిలో కేవలం ఐదుగురు మాత్రమే సమావేశానికి హాజరవడంతో అవిశ్వాసం వీగిపోయినట్టు ప్రకటించారు. సూర్యాపేట జిల్లా కోదాడ మున్సిపాలిటీ, మహబూబ్‌నగర్ మున్సిపాలిటీలో కాంగ్రెస్ కుట్రలు చేసి అవిశ్వాస తీర్మానాలను నెగ్గించుకున్నది.

## ప్రాథమిక సొసైటీల్లోనూ వీగిన అవిశ్వాసాలు

నాగర్‌కర్నూల్ జిల్లా పెంట్లవెల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అవిశ్వాసానికి సమయం ముగియడంతో పాత సొసైటీనే కొనసాగిస్తూ అధికారులు ఉత్తర్వులు జారీచేశారు. సహకార సంఘానికి 13 మంది డైరెక్టర్లు ఉండగా.. ఎనిమిది మంది బీఆర్ఎస్, ఐదుగురు కాంగ్రెస్. వారం కిందట అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టగా.. శుక్రవారం మధ్యాహ్నం ఒంటి గంట వరకు అవిశ్వాసానికి కాల వ్యవధిని డీసీవో పాత్యానాయక్ నిర్ణయించారు. గడువులోగా ఎవరూ రాకపోవడంతో అవిశ్వాసం వీగిందని ప్రకటించారు. దీంతో బీఆర్ఎస్ నేతలు సంబురాల్లో మునిగిపోయారు. ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలంలోని వీ వెంకటాయపాలెం ప్రాథమిక సహకార సంఘం చైర్మన్ కూరాకుల నాగభూషణంపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టగా..11 మంది (మొత్తం 13 మంది) డైరెక్టర్లు హాజరై తీర్మానానికి మద్దతు తెలిపారు. కాగా, డీసీవో విజయకుమారి ఫలితాన్ని ప్రకటించలేదు. నివేదికను కోర్టుకు సమర్పించనున్నట్టు తెలిపారు. ఈ నెల 30న ఫలితం వెల్లడికానున్నట్టు తెలిపారు.